# ప్రకాశ్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం


ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను కలిసిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రారెడ్డి, తదితరులు


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను శాలువాతో సన్మానిస్తున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 17 : ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను నాలుగోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తామని శంషాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొడిగంటి చంద్రారెడ్డి తెలిపారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫామ్ అందుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 2006 నుంచి ఓటమి ఎరుగని నాయకుడిగా ఉన్న ప్రకాశ్ గౌడ్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి ఎంతో మంది ప్రజలకు మేలు చేశారని వివరించారు. 2006 నుంచి దశలవారీగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్న ప్రకాశ్ గౌడ్‌కు నియోజకవర్గ ప్రజలు గుండెల్లోపెట్టుకొని ఆశీర్వాదం ఇస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు మరిన్ని పథకాలు అమలు చేయడానికి సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో అందరికి న్యాయం చేసే విధంగా ఉందన్నారు. నాయకుడు నీరటి రాజుముదిరాజ్, మండల యువత అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు దేవేందర్ తదితరులు ఉన్నారు.

### అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్తాం...

బండ్లగూడ: ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు బీ ఫామ్ అందజేయడంతో ఆమె ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్చన జయప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం కల్పిస్తామన్నారు. ప్రభాకర్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెస్టన్ కాలనీలో ఈ నెల 22న నిర్వహించే దేవీ శరన్నవరాత్రి, ,బతుకమ్మ ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను మంగళవారం కలిసి కాలనీ వాసులు ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రావులకోళ్ల నాగరాజు,కాట సాయిబాబాగౌడ్,మురళి, సిద్ధు,సాయిబాబా,మహేందర్,మహదేవ్,శాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. – బండ్లగూడ,అక్టోబర్ 17:

## తడి,పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి


చెత్త సేకరణ ఆటోలను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ,అక్టోబర్ 17.బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరూ తమ ఇండ్లలోని చెత్తను తడి,పొడి చెత్తగా వేరు చేసి తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటో వారికి అందజేయాలని కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. మంగళవారం రాధానగర్, అమృత ఎవెన్యూలో చెత్త సేకరణ తీరు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తడి,పొడి చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్,జవాన్లు,సురేశ్,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 17 : కట్ట మైసమ్మ దేవాలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని అలీకోల్‌తండా గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని అలీకోల్‌తండాలో కట్ట మైసమ్మ దేవాలయం పూర్వకాలం ది కావడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు ఇటీవల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. దాతలు సహకరిస్తే త్వరలో నిర్మాణం పూర్తి చేస్తామని వివరించారు. అలీకోల్‌తండాతో పాటు జూకల్ గ్రామాల ప్రజలు అమ్మవారికి బోనాల ఉత్సవాలు భారీ ఎత్తున నిర్వహిస్తారని తెలిపారు. మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు హేమ్లానాయక్, రమేశ్, చందర్, హిరు,వినోద్,మహేశ్, విష్ణు, మాను, రవి తదితరులు ఉన్నారు.

## మెరుగైన కంటి వైద్య సేవలు



సామాన్యులకు అనుకూలమైన ధరలతో మెరుగైన కంటి వైద్య సేవలను దక్షిణ భారతదేశంలో విస్తరింపజేసేందుకు మాక్సివిజన్ కంటి దవాఖాన సేవా దృక్పథంతో ముందుకు సాగుతుందని మాక్సివిజన్ గ్రూప్ ఆఫ్ ఐ హాస్పిటల్ సీఈవో వీఎస్ సుధీర్ తెలిపారు. నగరంలోని మణికొండ, అత్తాపూర్, తార్నాక ప్రముఖ ప్రాంతాలలో మాక్సివిజన్ మూడు కేంద్రాలను ఏకకాలంలో మణికొండ నూతన ఆసుపత్రిలో మంగళవారం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. –మణికొండ, అక్టోబర్ 17 :

## ఇద్దరు దొంగలు అరెస్టు

బండ్లగూడ, అక్టోబర్ 17 : ఇంటి తాళాలు పగులగొట్టి ఆభరణాలతో పాటు వెండి వస్తువులను దొంగిలించిన కేసులో ఇద్దరు అరెస్టయ్యారు. డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి శ్రీరాంనగర్‌కు చెందిన వంశీధర్‌రెడ్డి పని నిమిత్తం ఇంటికి తాళం వేసి ఈనెల 12న బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి బీరువాను పరిశీలించారు. బంగారు ఆభరణాలు, 16 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన వంశీధర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజు గౌడ్ శివ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనం ఒప్పుకోవడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ


శంషాబాద్ పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 17 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ పాఠశాల మైదానంలో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండిగోపాల్, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్ గౌడ్ పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు మహిళలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా బతుకమ్మ వేడుకలు నిలుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ నీరటి తన్విరాజు, సిరి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు కొలన్ రమాదేవి, పలువురు కౌన్సిలర్లు నాయకులు మహిళలు,తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెత్తను తొలగించాలి


పారిశుధ్య పనులను పరిశీలించిన అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

బండ్లగూడ,అక్టోబర్ 17: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి శానిటేషన్ డ్రైవ్‌ను పరిశీలించారు.ఉప్పర్‌పల్లి,హాపుగూడ,నలందనగర్,మూసీ పరివాహక ప్రాంతం,చింతల్‌మేట్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం,ప్రధాన రహదారులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఎక్కడికక్కడ పేరుకు పోయిన చెత్త చెదారాన్ని చూసి ఆయన రాంకీ సంస్థ ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. సర్కిల్ పరిధిలో చెత్త చెదారం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్,సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రి పూజలు


వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్, అక్టోబర్ 17: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ దేవాలయాలతో పాటు మండపాల వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. అత్తాపూర్, హైదర్‌గూడ, పాండురంగానగర్, శివానగర్, నందిముస్లాయిగూడ, నలందానగర్, రాంబాగ్, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి రోజు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తుండటంతో భక్తులు తమ మొక్కులను చెల్లించుకునేందుకు తరలివస్తున్నారు. ప్రతి రోజు అమ్మవారికి వివిధ రూపాలలో ముస్తాబు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు.

### మైలార్‌దేవ్‌పల్లిలో...

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 17: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్, గగన్‌పహాడ్, లక్ష్మీగూడ, వాంబే కాలనీ, రాజీవ్‌గృహకల్ప, టీఎన్‌జీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో అమ్మవారు కొలువుదీరిన మండపాల వద్ద భక్తిగీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## స్నేహితుడికి ఆర్థిక సహాయం



అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న క్లాస్‌మేట్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండ జిల్లా పరిషత్ పాఠశాలలో 1990–91 బ్యాచ్‌కు చెందిన నాటి విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని రోజంతా ఉల్లాసంగా గడిపారు. 33 సంవత్సరాల తర్వాత కలిసిన నాటి విద్యార్థులు వ్యాపారంలో, రాజకీయాలలో, ఉద్యోగాలలో రాణిసున్నట్లు తెలిపారు. అనంతరం అదే తరగతికి చెందిన గొల్లపల్లి గ్రామానికి చెందిన సిద్ధులు కొంతకాలం నుంచి పక్షవాతం రావడంతో ఇంటికే పరిమితమై ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో నాటి విద్యార్థులు అతడికి రూ. 30వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. అందజేసిన వారిలో సార కృష్ణాగౌడ్,పులిజాల సుధాకర్‌గౌడ్,బోయిని రవీందర్,అమరేందర్‌గౌడ్ ఉన్నారు. –శంషాబాద్ రూరల్, అక్టోబర్ 17